జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 11 | ఏప్రిల్ | 2026 • పేజీలు : 7

# క్యాంటీన్‌లో మిల్లెట్స్ వంటకాలు అందుబాటులోకి తేవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 10,(ప్రజాజ్యోతి)** కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో

మిగతా 7 లో...






# డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవల మెరుగుదల

- 11,650కు పారదర్శక టెండర్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు
- త్వరలోనే 15 వేల అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ ( సీతక్క )

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 10,(ప్రజాజ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆదివాసి సంప్రదాయమైన కొమ్ము నృత్యంతో స్వాగతం పలికిన అనంతరం మంత్రి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను సందర్శించి, అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన ఆహార పదార్థాలు, పిల్లలకు అర్థమయ్యే విధంగా రూపొందించిన విద్యా నమూనాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. "బేటీ బచావో" పథకం కింద ఆడపిల్లల తల్లులకు హిమాలయ కిట్లను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని

మిగతా 2 లో...



# మీ కడుపు సల్లం "కుండ"

- సుర్రుమంటున్న ఎండలు.. సిద్ధంగా కుండలు!
- మార్కెట్లో మట్టి కుండల జోరు
- చల్లదనానికి సహజ మార్గం వైపు ప్రజలు

**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి :** ఎండలు మొదలయ్యాయంటే ఒకప్పుడు ప్రతి ఇంట్లో కొత్త కుండలు తప్పనిసరి. పేదోడి ఫ్రిజ్ గా పేరుగాంచిన మట్టి కుండలు, కూజలు మళ్లీ ప్రాచుర్యం పొందుతు న్నాయి. ఆధునిక కాలంలో ఫ్రిజ్ లు వచ్చిన తర్వాత కొంతకాలం కుండల వినియోగం తగ్గినా, ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెర గడంతో ప్రజలు మళ్లీ సహజ మార్గాల వైపు అడుగులు వేస్తున్నారు. ఫ్రిజ్ లోని చల్లని నీరు తాగడం వల్ల జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్య లు వచ్చే అవకాశం ఉందని

మిగతా 7 లో...

# ఆదివాసి సంస్కృతి పరిరక్షణతోనే జాతి అస్తిత్వం నిలుస్తుంది: మంత్రి సీతక్క



**భద్రాచలం, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** ఆదివాసి గిరిజన తెగల జీవన విధానం, పూర్వీకులు అందించిన ఆస్తి, అస్తిత్వం, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు మరవకుండా రాబోయే తరాలకు అందిస్తేనే "దేశానికి మూలం ఆదివాసులం" అనే నినాదానికి సార్ధకత కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు.శుక్రవారం ఐటిడిఏ

మిగతా 2 లో...

# వర్షాకాలంలో... విపత్తు ఖాయం?

- రైతుల ప్రాణాలకే ఎక్కువగా పొంచిఉన్న ముప్పు
- అక్రమ తవ్వకాలతో మొర్రేడు వాగు మృత్యు కూపం
- పెనుబెల్లి ఇసుక మాఫియాను నివారించేదెప్పుడు
- సింగరేణి భూములలో అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకునేది ఎవరు..?
- అరవిందుడి ఇసుక దందా బీభత్సం
- అధికారులు మేలుకోకపోతే భారీ ప్రాణానష్టం తప్పదు

**కొత్తగూడెం, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు దారుణ స్థాయికి చేరుకుని ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ఉమ్మడి చాతకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని మొర్రేడు వాగు చుట్టూ నిబంధనలకు విరుద్ధంగా భారీ స్థాయిలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా జేసీబీలతో చేపడుతున్న



మిగతా 2 లో...

# ఆదివాసి సంస్కృతి పరిరక్షణతోనే జాతి అస్తిత్వం నిలుస్తుంది: మంత్రి సీతక్క





(మొదటి పేజీ తరువాయి...)

ప్రాంగణంలోని గిరిజన భవనంలో నిర్వహించిన ఆదివాసి సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనం, కోయ ఇలవేల్పుల చరిత్ర గ్రంథావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆమెకు గిరిజన సంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. చిన్నారుల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకోగా, మంత్రి సీతక్క, శాసనసభ్యులు, అధికారులు కలిసి గిరిజన నృత్యంలో పాల్గొన్నారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి మాట్లాడుతూ, ఆదివాసులే దేశానికి మూలవాసులని, రేల పాటలు, డోలి వాయిద్యాలు వారి ఐకమత్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. కొండ కోనల్లో నివసించే గిరిజనుల ఆచార వ్యవహారాలు, కులదేవతలపై విశ్వాసాలు, తెగల చరిత్ర, సామాజిక వ్యవస్థ, నైతిక విలువలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. కోయ తెగలో పూజా విధానాలు, కులదేవతల ఆవిర్భావ కథలు, ఇలవేల్పుల పండుగలు వంటి అంశాలను లిఖితరూపంలో సేకరించడం ఎంతో గర్వకారణమని, ఇందుకు కృషి చేసిన తలపతులు, ఆర్తిబిడ్డలను అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. గిరిజన గ్రామాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేస్తే ఆదివాసులు వారిని దేవుళ్లుగా భావిస్తారని అన్నారు. గిరిజన సంక్షేమం కోసం ఐటిడిఏలను ఏర్పాటు చేసి, విద్య, వైద్యం, మౌలిక వసతుల కోసం ప్రభుత్వం విస్తృతంగా నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. పాత తరంలో ఆదివాసులు ప్రకృతి ఆధారిత జీవన విధానంతో, కందమూలాలు, రాగులు, జొన్నలు, మక్క వంటి ఆహారంతో ఆరోగ్యంగా దీర్ఘాయుష్షుతో జీవించారని, ఆహారపు అలవాట్లు నేటి తరానికి ఔషధంలా ఉపయోగపడతాయని అన్నారు. అందువల్ల ఆదివాసి సంస్కృతి, ఆచారాలు, ఆహార నియమాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇలవేల్పుకు గ్రామాల్లో గుడులు నిర్మించి దేవతలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కొండరెడ్డి గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో భద్రాచలానికి వచ్చినప్పుడు గిరిజన మ్యూజియంను సందర్శించానని, అందులోని కళాఖండాలు విశేషంగా ఆకట్టుకున్నాయని చెప్పారు. మ్యూజియం అభివృద్ధికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ ద్వారా కోటి రూపాయలు మంజూరైనట్లు వెల్లడించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల సంస్కృతి ప్రత్యేకతను వివరించారు. కాలక్రమేణా కనుమరుగవుతున్న సాంప్రదాయాలను కాపాడేందుకు గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయడం, కోయ భాష, సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇలవేల్పుల చరిత్ర గ్రంథం రూపొందించడం సంతోషకరమని తెలిపారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడు తూ గిరిజన విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు ప్రోత్సాహం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుతున్నారని చెప్పారు. ఐఐటీలకు ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించినట్లు తెలిపారు. గిరిజన మహిళల స్వయం ఉపాధి కోసం ఎస్‌హెచ్‌జీ, ఎంఎస్ ఎంఈ గ్రూపులకు మద్దతు అందిస్తున్నామని, ఆర్గానిక్ పంటలకు మార్కెట్ కల్పించేందుకు భద్రగిరి మార్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రభావం తగ్గించి రైతులకు లాభం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం కోయ ఇలవేల్పుల చరిత్ర గ్రంథాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పీవో బి. రాహుల్‌కు "ఆదివాసి వికాసరత్న" బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఏసీఎంవో రమేష్, సర్పంచ్ పూణెం కృష్ణ, రిటైర్డ్ అధికారి రమణయ్య, గిరిజన పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవల మెరుగుదల

(మొదటి పేజీ తరువాయి...)

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోషకాహార కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పిల్లల బరువు, పోషకాహార వివరాలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత, వేగం పెరుగుతాయని వివరించారు. స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడిందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఓపెన్ టెండర్ విధానంలో కొనుగోలు చేపట్టగా ప్రారంభంలో సుమారు ₹14,000 వరకు ధరలు వచ్చినప్పటికీ పలు దఫాల టెండర్ ప్రక్రియ అనంతరం ఒక్కో ఫోన్‌ను ₹11,650కు పొందగలిగామని తెలిపారు. ప్రజల డబ్బు ఆదా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం ₹9,000కు ఫోన్లు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం చేపట్టిన పారదర్శక విధానంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో అంగన్‌వాడీలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాలను పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి 12 వేల భవనాలు మంజూరు చేయడం, మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు వంటి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఇప్పటివరకు సుమారు ₹8 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జీవో విడుదలకు ముందే రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వేతనాల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నామని, త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. అదేవిధంగా సుమారు 15 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకు కేంద్ర ప్రభుత్వం కేవలం ₹2,800 మాత్రమే అందిస్తోందని, మిగతా భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. జీతభత్యాల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 275 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో నిపుణులు, అంగన్‌వాడీ టీచర్లతో కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చర్యలపై మేధోమథనం నిర్వహిస్తామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లా, బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను తమ సొంత పిల్లలుగా భావించి సేవలు అందించాలని సూచించారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్‌లు అందించడం ద్వారా సేవల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని



అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ఆధునికీకరించడంలో ఈ కార్యక్రమం కీలకమని, కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కీలకమని పేర్కొన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో ఆధునిక సౌకర్యాలతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చామని, చెంద్రుగొండ మండలం మద్దుకూరు కేరళ తరహాలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అన్ని కేంద్రాలకు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల విస్తరణతో సేవలు మరింత విస్తరించాయని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి జీతభత్యాలు పెంపు, సంక్షేమ చర్యలు మరింత విస్తరించాలని మంత్రి ని కోరారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 1954 అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ చేయడం ద్వారా ఐసీడీఎస్ సేవలు మరింత సమర్థవంతంగా అమలు అవుతాయని తెలిపారు. డేటా సేకరణ, నివేదికల పంపిణీ, లబ్ధిదారుల వివరాల నిర్వహణ సులభతరం అవుతుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 2061 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్ని అంగన్వాడీ కేంద్రాలలో విద్యుదీకరణ పనులు పూర్తి చేశామని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. 197 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పిల్లల వివరాల నమోదు, పోషకాహారం పంపిణీ వంటి కార్యక్రమాల్లో ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, జిల్లా అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విపత్తు ఖాయం?

(మొదటి పేజీ తరువాయి...)

ఈ తవ్వకాల కారణంగా 40 నుంచి 70 అడుగుల లోతులో భారీ గోతులు ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సింగరేణి భూముల్లో సింగరేణి బొగ్గు బావులను తలపించే ఈ గోతులు ఏర్పాటు చేసి ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా వదిలేయడం వల్ల ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరైనా అప్రమత్తంగా లేకుండా పడిపోతే ప్రాణనష్టం తప్పదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా రోజురోజుకీ పెరుగుతుండగా ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయం కొందరి చేతుల్లోకి వెళ్లిపోతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల మౌనం వెనుక రాజకీయ, అధికార అండదండలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. వాగులో నీరు చేరిన తర్వాత ఈ గోతులు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు పెరిగే అవకాశముందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. బోరు పంపులు వేసేందుకు వచ్చే రైతులు, పశువులు ఈ గోతుల్లో పడిపోతే భారీ



ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ జరుగుతున్నాయని సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోవడంలో అలసత్వం చేయడం వలన మళ్లీ అదే ప్రాంతంలో తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత కొత్తగూడెం ప్రాంతానికి చెందిన అరవింద్ అనే వ్యక్తి సింగరేణి భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టి భారీ ప్రమాదాలకు కారణమవుతున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ ఇలాంటి దందాలను అడ్డుకునే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ››› వర్షాకాలంలో విపత్తు ఖాయం?

మొర్రేడు వాగు పరిసర ప్రాంతాలు ప్రస్తుతం మృత్యు వలగా మారాయి. ఎక్కడ చూసినా భారీ గోతులు కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో ఇవి నీటితో నిండిపోవడం వల్ల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పొలాల్లో పని చేసే సమయంలో అప్రమత్తంగా లేకుండా ఈ గోతుల్లో పడిపోతే ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీల్డ్ స్థాయిలో అధికారులు పర్యటించకపోవడం, తనిఖీలు లేకపోవడమే ఇలాంటి అక్రమ దందాలకు కారణమని వారు విమర్శిస్తున్నారు.

### ››› అరవిందుడి ఇసుక దందా బీభత్సం

పాత కొత్తగూడెం ప్రాంతానికి చెందిన అరవిందుడి ఆధ్వర్యంలో సాగుతున్న అక్రమ ఇసుక దందా తీవ్ర స్థాయికి చేరుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొర్రేడు వాగు చుట్టూ జేసీబీలతో భారీగా తవ్వకాలు చేపట్టి లోతైన గోతులు తవ్వడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. రోజురోజుకీ వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు జరుగుతుండగా సంబంధిత అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయం నష్టపోతున్నప్పటికీ చర్యలు లేకపోవడం వెనుక అండదండలు ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేలుకొని అక్రమ తవ్వకాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలకు భారీ సన్నాహాలు

- అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరణ
- వర్గాల ప్రజల ఐక్యంతో ఘన నిర్వహణ లక్ష్యం
- అంబేద్కర్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలని మాల మహానాడు పిలుపు



**కొత్తగూడెం, ఏప్రిల్ 10 ( ప్రజాజ్యోతి )** భద్రాచలంలో ఈనెల 14న నిర్వహించనున్న భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మాల మహానాడు జిల్లా నాయకత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలోని ఎస్సీ, ఎస్టీ సింగరేణి ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో మాల మహానాడు నాయకులు సమావేశమై జయంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా అధ్యక్షులు పూల రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా భద్రాచలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు ఎర్రమల రాములు ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. అదేవిధంగా జయంతి వేడుకల సందర్భంగా అన్నదానం, వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సబ్బండ వర్గాలకు చెందిన ప్రజలు, యువత, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా నాయకులు పగిడిపల్లి శ్రీకాంత్, పి.ఎన్. మూర్తి, సొల్లు రవికిరణ్, వాడపల్లి రమేష్, బూరుగు సతీష్, గంధం కల్పన, రౌతు నిరంజన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు దూరంగా... మంచి అలవాట్లకు దగ్గరగా ఉండండి

- సీఐ తిరుపతి. ఎస్సై రాధూప్



**గుండాల ఏప్రిల్ 10 ( ప్రజాజ్యోతి )** యువత చెడు అలవాట్లకు దూరంగా మంచి అలవాట్లకు దగ్గరగా ఉండాలని తద్వారా సమాజంలో విలువలు పెరుగుతాయని గుండాల సీఐ తిరుపతి ఎస్సై రాధూప్ అన్నారు శుక్రవారం గుండాల మండలం దామరతోవు గ్రామంలో జరిగిన గ్రామోత్సవ సభలో వారు మాట్లాడారు యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మద్యం , గుట్కా, గంజాయి తదితర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సమాజానికి గ్రామానికి ఉపయోగపడే మంచి లక్షణాలకు దగ్గరగా ఉంటూ పని చేయాలన్నారు. మంచి లక్షణాలను అలవాటు పరుచుకోవడంలో యువత ముందుండాలన్నారు యువత విద్యపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను సాధించి కుటుంబానికి గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు పోలీసులు అందుబాటులో ఉంటారని పోలీస్ సేవలు వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన బాలరాజు కిరణ్ లకు సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారావు. ఉపసర్పంచ్ గ్రామస్తులు పాల్గొన్నారు

## ప్రజా జ్యోతి ఎఫెక్ట్....

# పంచాయతీ కార్యాలయం ముందున్న ప్రమాదకర గొయ్యి పూడ్చివేత



ప్రజాజ్యోతి
10 Apr 2026 - Page 1
పొంచి ఉన్న ప్రమాదం...
పట్టించుకోని అధికారులు



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం ముందు మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల వల్ల ఏర్పడిన ప్రమాదకర గొయ్యిని అధికారులు శుక్రవారం మధ్యాహ్నం సమయంలో పూడ్చివేశారు. గత కొన్ని రోజులుగా ఈ సమస్యపై గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఉండగా, ప్రజా జ్యోతి పత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు.రోడ్డుకు సమీపంలో ఉండటంతో ఈ గొయ్యి ప్రమాదానికి దారి తీసే పరిస్థితి నెలకొనగా, ఎట్టకేలకు దానిని పూడ్చివేయడం స్థానికులకు ఊరటనిచ్చింది. ముఖ్యంగా పంచాయతీ కార్యాలయం ముందు రోజూ రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.గొయ్యి పూడ్చివేతతో ఇప్పుడు ప్రమాదం పూర్తిగా తొలగిపోయిందని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న అధికారులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి సమస్యలు మళ్లీ తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు చేపట్టే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కార్పొరేషన్ ఫలితాలపై లీగల్ ఫైట్ ప్రారంభం

- 47, 54 డివిజన్లపై పిటిషన్లు నమోదు

**కొత్తగూడెం, ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి):** ఇటీవల ముగిసిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై లీగల్ ఫైట్ ప్రారంభమైంది. కార్పొరేటర్లుగా గెలిచిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ రెండు ఎన్నికల పిటిషన్లు జిల్లా కోర్టులో దాఖలయ్యాయి. పిటిషన్లను స్వీకరించిన కోర్టు సంబంధిత ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మే 6కు వాయిదా వేసింది. వివరాల్లోకి వెళ్తే... కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్–47 (పాత పాల్వంచ) మరియు డివిజన్–54 (సఫాయి బస్తీ) ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. డివిజన్–47లో గెలిచిన సీపీఐ అభ్యర్థి గుర్రం వెంకటేశ్వర్లుపై బీఆర్ ఎస్ అభ్యర్థి మిర్యాల అలివేలు పిటిషన్ దాఖలు చేయగా డివిజన్–54లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి జయంతి మసూద్ పై బీఆర్ ఎస్ అభ్యర్థి మాదాసు పద్మ పిటిషన్ వేశారు. ఎన్నికల ప్రక్రియలో జరిగిన అవకతవకలను ప్రస్తావిస్తూ ఫలితాలను రద్దు చేసి గెలిచిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని పిటిషనర్లు కోరారు. ఈ కేసుల్లో పిటిషనర్ల తరఫున న్యాయవాదులు సాదిక్ పాషా, సామంత్, సంకుబాపన అనుదీప్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న జిల్లా కోర్టు పిటిషన్లను స్వీకరించి ఎన్నికల పిటిషన్ నంబర్లు 2/2026, 3/2026గా నమోదు చేసింది. ఇదిలా ఉండగా, కోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతో పాటు కేసు తదుపరి విచారణను మే 6కు వాయిదా వేసింది. ఈ పరిణామంతో కొత్తగూడెం కార్పొరేషన్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలి

- : ఏఐటీయూసీ పిలుపు




**చుంచుపల్లి, ఏప్రిల్ 10 ( ప్రజాజ్యోతి )** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత సహా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ హెడ్ ఆఫీస్, నర్స్ క్వార్టర్స్, బాబు క్యాంపు తదితర ప్రాంతాల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు యర్రగాని కృష్ణయ్య, కే.డబ్ల్యూ. కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనాల జీవోలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఈఎస్ఐ అమలులో సింగరేణి యాజమాన్యం జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం పరిధిలోని కార్మికులకు బి కేటగిరి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 సమ్మెకు విధించిన పెనాల్టీపై ఏఐటీయూసీ నాయకులు సీఎండీని కలవగా సానుకూల స్పందన లభించినట్లు తెలిపారు. అలాగే వేసవి నేపథ్యంలో ఈ నెల 15 నుంచి పని వేళలను మార్చనున్నట్లు పేర్కొన్నారు. ఇదే సందర్భంలో హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఆఫీస్ అటెండర్లకు కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఎం. వెంకటేష్‌ను ఇన్‌చార్జిగా, ఎం. శారదను మహిళా ఇన్‌చర్జిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# బడిబాట ప్రచారం జోరుగా... ఎర్రగుంటలో కరపత్రాల పంపిణీ

- ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలకు ఉపాధ్యాయుల అవగాహన కార్యక్రమం
- ప్రధాన కూడలిలో కరపత్రాల పంపిణీ... విద్యార్థుల చేరికలకు పిలుపు






**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎర్రగుంట ప్రధాన కూడలిలో కరపత్రాల పంపిణీ చేపట్టారు.దుకాణదారులు, వాహనదారులు, ప్రయాణికులకు బడిబాట కరపత్రాలు అందజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెద్దిరెడిగూడెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వేముల నరేష్ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు.మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనందకుమార్, ఎర్రగుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. గ్రామ పెద్ద వేముల రమణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచిందని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బసవయ్య, షైక్ దస్తగిరి, ఉపాధ్యాయులు శాంత కుమారి, రాజ్యలక్ష్మి, బాబు రావు, వెంకటేశ్వర రావు, సుశీల, పద్మ, దుకాణ యజమానులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుతూ ప్రతి విద్యార్థిని నమోదు చేయించడమే లక్ష్యంగా ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.

## శివాలయ చైర్మన్ ఆహ్వానానికి స్పందించిన ఎమ్మార్వో స్వర్ణ

- తేనేటి విందులో పాల్గొన్న ఎమ్మార్వో... ఆత్మీయ ఆతిథ్యం



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో నూతన ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణకు శివాలయం చైర్మన్ మల్లెల నరసింహారావు ఆహ్వానం పలికారు. ఆయన ఆహ్వానం మేరకు ఎమ్మార్వో స్వర్ణ ఎర్ర గుంటలో ఉన్న మల్లెల నరసింహారావు స్వగృహానికి వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు.మర్యాద పూర్వకంగా ఆహ్వానాన్ని స్వీకరించిన ఎమ్మార్వో కొంతసేపు అక్కడ గడిపి, స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా పరస్పర పరిచయాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మల్లెల నరసింహారావు కుటుంబ సభ్యులు శాలువా కప్పి ఎమ్మార్వోను సత్కరించారు.మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మార్వో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగి, పరస్పర అనుబంధాన్ని మరింత బలపరిచింది. ఈ కార్యక్రమంలో మల్లెల నరసింహారావు కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులు వేముల రమణ పాల్గొన్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీవో జమలారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశాలు, 9.30 గంటలకు రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కళాశాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం, 10 గంటలకు తహశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొంటారని తెలిపారు.

## డ్రైన్ ఎండ్ సోక్ ఫిట్ నిర్మాణమును పరిశీలించిన ఎంపీడీవో



**టేకులపల్లి,ఏప్రిల్ 10,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం సుక్కలబోడు గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛభారత్ గ్రామీణ పథకంలో భాగంగా నిర్మించిన డ్రైన్ ఎండ్ సోక్ పిట్ నిర్మాణం పనులను టేకులపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బైరు మల్లేశ్వరి గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోతు రామ పరిశీలించారు. డ్రైన్ ఎండ్ సోక్ పిట్ ఏర్పాటు చేయడం వలన గ్రామంలో నుండి వచ్చే మురికి నీరు నిల్వ ఉండ కుండా ఇంకిపోవడం జరుగుతుంది అని ఎంపీడీఓ తెలిపారు.గ్రామంలోని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా,మురుగునీరు వాసన రాకుండా గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని ఎంపీడీవో తెలియజేశారు. అన్ని గ్రామంలో ఇటువంటి నిర్మాణాలు ఎక్కువగా నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ కోరారు.ఈజిఎస్ ఏపిఓ శ్రీనివాస్,ఈసి తిరుపతయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):** దొంగతనం కేసులో నిందితుడిని బూర్గంపహాడ్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని మోతె పట్టీనగర్ పంచాయతీ చింతకుంటకు చెందిన కుంజ లక్ష్మయ్య ఇంట్లో గత ఏడాది డిసెంబర్ లో దొంగతనం జరిగింది. కాగా దొంగతనం చేసిన ఆంధ్రాలోని కుక్కునూరు మండలం ఉప్పేరుకు చెందిన కుమ్మరపల్లి రాజేష్ ను అరెస్టు చేసి రిమాండు తరలించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి సెల్ఫోన్, దొంగతనం చేసిన పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

# జెట్టిగూడెం గోదావరి పెర్రి పడవ ప్రారంభం

**చర్ల, ఏప్రిల్ 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని పెద్దిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జెట్టిగూడెం నుండి సింగారం రేవు గోదావరి పెర్రిలో పడవ రవాణా పాటదారుడు శుక్రవారం ప్రారంభించారు.పంచాయతీ జిల్లా అధికారి (డిపిఓ) ఆదేశాను సారం మూడవసారి జరిగిన వేలం పాటలో హెచ్చు పాటదారుడు తెల్లం.భీమరాజుకు పాటను ఖరారు చేశారు.ప్రభుత్వ నిబంధన ప్రకారం వేలం పాటలో పాడిన 7,90,000 వేల రూపాయలలో 80 శాతం పంచాయతీకి చెల్లించి పంచాయితీ అనుమతులతో జెట్టిగూడెం నుండి సింగారం రేవు గోదావరి పెర్రిలో పడవను నడపడానికి ప్రారంభించారు. వేలం షరతులను అధికారులు వివరించారు వాటి లో పడవు ఎక్కిన ప్రతి ఒక్కరి దగ్గర తీసు కున్న రుసుమునకు రసీదు చెల్లించాలి అని పడవలో అక్రమ పశువు లు,అక్రమ కలప రవాణా చేయరాదు అని పడవలో ఎక్కిన ప్రతి ఒక్కరికి లైఫ్ జాకెట్స్ తో కలిపి ఒక్కొక్క మనిషికి పెద్ద వాళ్ళకు 60 రూపాయలు,పిల్లలకు 30 రూపాయలు తీసుకోవాలని పంచాయతీ అధికారులు సూచించారు.గోదావరి రేవుపై ఉపయోగించే పడవ లను మూడు నెలలకు ఒకసారి రెవిన్యూ, పోలీస్,బిడబ్ల్యుడి శాఖ అధికారులతో తనిఖీలు చేయించుకుని సంబంధిత శాఖ ల అధికారులచే లైసెన్సులను పొందాలి అని గ్రామపంచాయతీ అధికారులు నిర్ణయించిన రేట్ల ప్రకారమే పాటదారుడు వసూలు చేయాలి అని అధికారుల ఆదేశాలను అతిక్రమించి ఎక్కువ రేట్లు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటారు అని అన్నారు.పాటదారుడు గ్రామ పంచాయతీ ఇచ్చిన ప్రయాణికుల చార్జీల వివరాలను పడవ ఎక్కే వాళ్ళకు కనిపించేటట్లుగా గోదావరి రేవు వద్ద, బస్ స్టాపుల వద్ద,బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ అధికారులు ఇచ్చిన నిబంధనలో పేర్కొన్నారు.



## భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

- 2 వేల రూపాయలు జరిమాన

**టేకులపల్లి,ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** భార్యను హత్య చేసిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. టేకులపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సైరాజేందర్ తెలిపి వివరాలు టేకులపల్లి మండలం హనుమతండ గ్రామానికి చెందిన గుగులోత్ భాస్కర్(38) డిసెంబర్ 15 2020 తన భార్య గుగులోత్ మంగ (28) హతమార్చాడు. తన స్వయంగా టేకులపల్లి పోలీస్ స్టేషన్లో తన భార్య కనపడటం లేదని ఫిర్యాదు చేయగా మొదటి అనుమానం భర్త పై రావడం పోలీసులు అతనిని విచారించగా చేసిన నేరాన్ని అతడు ఒప్పుకున్నా డు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న టేకులపల్లి పోలీసులు సీఐ రాజు ఆధారాలు సేకరించి కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు గుగులోత్ భాస్కర్ జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది.సాక్ష్యాలు కోర్టుకు సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా చర్య తీసుకున్న టేకులపల్లి పోలీసులను,పివిడి లక్ష్మి, కోర్టు కానిస్టేబుల్ ఎల్. వీరలాల్ లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అభినందించారు.

## 108 వాహనం ఆకస్మిక తనిఖీ



**చర్ల, ఏప్రిల్ 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సేవలందిస్తున్న 108 అంబులెన్స్ ను శుక్రవారం జీవికే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆడిట్ అధికారి కిషోర్, డివిజన్ ఇంచార్జ్ మనోహర్ తనిఖీ చేశారు.వాహనంలోని వైద్య పరికరాలు, మందుల లభ్యత, ఆక్సిజన్ నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో (గోల్డెన్ అవర్) సిబ్బంది అప్రమత్తంగా ఉండి బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎంఈ మనోహర్, ఈఎంటీ సుజిత, పైలట్ జెట్టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్వర్ణభద్ర కవచాలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

**భద్రాచలం కల్చరల్, ఏప్రిల్ 10, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణభద్ర కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకరబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.



## ఆ ..సౌకర్యాలు...ఏవి..?



**చర్ల, ఏప్రిల్ 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మేజర్ పంచాయతీ పరిధిలో తాసిల్దార్ కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి ,పోలీసు స్టేషన్ వంటివి ఒకే చోట ఉండటంతో మండలంలోని ప్రజలు మహిళలు ,వృద్ధులు తమకు ఏ అవసరమున్న మండల తాసిల్దార్ కార్యాలయానికి, పంచాయతీ ఆఫీస్ కి పోలీస్ స్టేషన్ కి తమ తమ సమస్యలపై వినతి పత్రాలను తమకు అందవలసిన పత్రాలు తీసుకొనుటకు ప్రతినిత్యం ఆఫీసులో చుట్టూ తమ పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. ఇదే సందర్భంగా మహిళలు ,వృద్ధులు కూడా ఆఫీసులకు వస్తూ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడం వలన మహిళలు, వృద్ధులు బీపీ ,షుగర్ లాంటి సమస్యలు ఉన్నవారు అందుబాటులో పబ్లిక్ టాయిలెట్స్ లేనందున ఇబ్బందులకు గురవుతున్నారని మండల వాసులు వాపోతున్నారు . ప్రతి సంవత్సరం పంచాయతీ వారు వేలం పాటలు నిర్వహించి ఆశీలను వసూలు చేస్తూ ఉన్నారని పంచాయతీ పరిధిలోని సంతపాకలో ప్రతి ఆదివారం ఛత్తీస్గఢ్, ఒరిస్సా, రాష్ట్రాలకు చెందిన గిరిజన ప్రాంత ప్రజలు సంతకు వచ్చి తమకు కావలసిన వస్తువులు విక్రయిస్తూ ఉంటారని ఉంటారు . ఆ సందర్భంలో వ్యాపారస్తులు, మహిళలు గ్రామ పంచాయితీ సంతపాకలలో తమ వ్యాపారం నిర్వహిస్తున్న ప్పటికీ పబ్లిక్ టాయిలెట్స్ సదుపాయం లేనందున ఇబ్బంది పడుతున్నారని పంచాయతీ వారు ఆశీలు పాట నిమిత్తం పాటను దక్కించుకున్న పాటదారులు సరైన సదుపాయాలు లేనప్పటికీ పన్ను వసూలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే లాగా పన్నులు వసూలు చేస్తున్నారే కానీ వ్యాపారస్తులకు ,వృద్ధులకు ,మహిళలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద పంచాయతీ సంతపాకలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం స్వచ్ఛ భారత్ వంటి పథకాలు అమలు చేస్తున్నప్పటికీ మండలంలో ఇప్పటికీ పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులో లేవని మండల వాసులు అంటున్నారు. జీవన ఉపాధి కోసం పంచాయితీ ఆసీలు పాట దక్కించుకుంటున్నామని తద నంతరం పన్ను వసూళ్లకు వెళ్తున్న సందర్భంలో వ్యాపారస్తులు ,మహిళలు పబ్లిక్ టాయిలెట్ సౌకర్యాలు లేవని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారని పాట దక్కించుకున్న వారు అంటున్నారు.అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని మండలంలోని మహిళలు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులను గమనించి ప్రభుత్వ కార్యాలయాల వద్ద సులభ్ కాంప్లెక్స్ లను నిర్మించాలని మండలవాసులు కోరుకుంటున్నారు.

# ప్రమాదాలకు చెక్... రోడ్డు భద్రతపై కఠిన చర్యలు

- **ఎం.పి.డి.ఓ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశం**



**దమ్మపేట,ఏప్రిల్.10,(ప్రజాజ్యోతి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నేషనల్ హైవేలు, ప్రధాన రహదారులు మరియు గ్రామీణ రోడ్లపై ప్రమాదాలకు కారణమవుతున్న మూలమలుపులు, అడ్డంకులు, దెబ్బతిన్న రోడ్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర వృక్షాలు, రాళ్లు, మట్టి గుంతలను తొలగించడం, రోడ్లపై గుంతలను పూడ్చడం వంటి పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. అదనంగా, అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం, ముఖ్యంగా యువతలో భద్రతా నిబంధనలపై చైతన్యం పెంచడం అవసరమని పేర్కొన్నారు.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని అధికారులు హెచ్చరించారు. వేగ పరిమితులను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం ద్వారా చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలన్నారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట తహశీల్దారు రామ్ నరేష్, ఎంపీడీవో బి. రవీంద్ర రెడ్డి, ఎం.ఈ.ఓ జగపతయ్య, ఏఈ (పీఆర్) జుంకీలాల్, అశ్వరావుపేట సిఐ పి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ సేవలపై ఆకస్మిక తనిఖీ

- **పరికరాలు, మందుల పరిశీలన... సేవలపై సంతృప్తి**
- **అత్యవసర సేవల పనితీరుపై సమీక్ష... సిబ్బందికి సూచనలు**
- **సమర్థంగా సేవలు అందిస్తున్న సిబ్బంది... అధికారుల ప్రశంసలు**



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని 108 అంబులెన్స్, 102 వాహన సేవలను జీవీకే ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీస్ కేంద్ర కార్యాలయం హైదరాబాద్ నుంచి వచ్చిన ఆడిటర్ ఫయాజ్ ఆకస్మికంగా తని ఖీ చేశారు. అంబులెన్స్‌లలో ఉన్న మెడికల్ పరికరాల పనితీరు, మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, నిర్వహణ రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.అత్యవసర కేసుల నిర్వహణ విధానం, సేవల సమయపాలన, సిబ్బంది పనితీరును కూడా సమీక్షించారు. మందుల నిర్వహణ సక్రమంగా ఉండటం, పరికరాలు సరిగా పనిచేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.సిబ్బంది పనితీరును మెచ్చుకుని, ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమయం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 108 మేనేజర్ మనోహర్, ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్ పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ పద్మ, కళాధర్, వాహన పైలెట్స్ రాజా, సురేష్ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారని అభినందించారు.అంబులెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలకు కీలకంగా మారాయని, ప్రజలు అవసరమైనప్పుడు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

## కోర్టులో సదుపాయాల విస్తరణ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ప్రత్యేక గది

- **జూనియర్ సివిల్ జడ్జి భవాని చేతుల మీదగా ప్రారంభోత్సవం**





**దమ్మపేట, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):** దమ్మపేట కోర్ట్ ఆవరణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నూతన కార్యాలయ గది ఏర్పాటు చేసి ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జూనియర్ సివిల్ జడ్జి శ్రీ బి. భవాని ప్రారంభించగా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొంది మురళి మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.జూనియర్ సివిల్ జడ్జి భవాని మాట్లాడుతూ, కోర్టు ఆవరణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ప్రత్యేక కార్యాలయ గది ఏర్పాటు చేయడం ఒక శుభపరిణామమని తెలిపారు. ఈ సదుపాయం ద్వారా కేసుల నిర్వహణ మరింత సులభతరం అవడంతో పాటు న్యాయ సేవలు వేగవంతంగా అందించగలమని అన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు న్యాయం త్వరితగతిన అందించవచ్చని పేర్కొన్నారు. కోర్టు పరిధిలో అవసరమైన సదుపాయాలను దశలవారీగా మెరుగుపరచేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లక్కినేని నరేంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ ముప్పిడి శ్యామ్ సుధాకర్, సెక్రటరీ తుమ్మ రాంబాబు, టి. అరుణకుమారి, తీర్థనాటి సంజయ్, ట్రెజరర్ తామ బాలరాజు సీనియర్ న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, మారం సతీష్‌కుమార్ బాబు, నల్లపు ఉదయ్ కుమార్, ఎస్కే దర్గావలి, గద్దల అప్పారావు, గోళ్ళ భవాని, కృష్ణ యాదవ్, కాలం సంధ్యారాణి, శ్వేత తదితరులు హాజరయ్యారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుంట శ్రీనివాసరావు, అశ్వారావుపేట కోర్ట్ కానిస్టేబుల్ ప్రశాంత్, దమ్మపేట కోర్ట్ కానిస్టేబుల్ వి. రాంబాబు, కోర్ట్ సూపరింటెండెంట్ ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ప్రత్యేక కార్యాలయ గది ఏర్పాటు చేయడం ద్వారా న్యాయపరమైన సేవలు మరింత సమర్థవంతంగా అందించగలమని న్యాయవాదులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రజబ్ అలీ ఆశయాలను కొనసాగిద్దాం

- **ప్రజా పోరాటాలే నిజమైన నివాళి: సాబీర్ పాషా**



**కొత్తగూడెం, ఏప్రిల్ 10 ( ప్రజాజ్యోతి )**ప్రజాపక్షపాతి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి మహమ్మద్ రజబ్ అలీ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. రజబ్ అలీ 30వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా సాధారణ జీవితం గడిపిన నేత రజబ్ అలీ అని కొనియాడారు. సాయుధ పోరాట కాలంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూములు పంచిన మహోన్నత వ్యక్తి అని గుర్తుచేశారు. అసెంబ్లీలో అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి వారి హక్కుల కోసం పోరాడారని తెలిపారు. నేటి తరానికి ఆయన నిజాయితీ, నిరాడంబరత ఆదర్శమని పేర్కొంటూ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.

## ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్‌కు పాల్పడితే కేసులు తప్పవు

- **ఎస్ఐ సురేష్ హెచ్చరిక**



**పినపాక,ఏప్రిల్ 10 (ప్రజాజ్యోతి)**ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తామని బయ్యారం ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. శుక్రవారం తిరుపాక మండలం ఈ బయ్యారం రక్షకభట కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా కొందరు వ్యక్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాల్లో అక్రమ బెట్టింగ్ నిర్వహించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బెట్టింగ్‌లో పాల్గొనడం చట్టవిరుద్ధమని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత తాత్కాలిక లాభాల కోసం ఇలాంటి చట్టవ్యతిరేక పనుల్లో పాల్గొనకూడదని సూ చించారు.తమ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టగలమని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఐపీఎల్ సీజన్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## డ్రగ్స్, గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు

- **యువత జీవితాలు సస్యశ్యామలంగా ఉండాలంటే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి సీఐ అశోక్ రెడ్డి**



**అశ్వాపురం, ఏప్రిల్ 10 ప్రజాజ్యోతి**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని యువత ఆరోగ్యం, భద్రత నిమిత్తం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గంజాయి, డ్రగ్స్ పై కఠిన చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉంది డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమ స్య మారింది. డ్రగ్, గంజాయి మహమ్మార్లు యువత జీవితాలను అగాధంలోకి నెట్టి వేస్తున్నాయి. యువత జీవితాలను నాశనం చేస్తుంది అది కాకుండా కుటుంబాలను రోడ్లమీదకి తీసుకొచ్చి వాళ్ళని అభాగ్యులను చేస్తుంది. ఈ మహమ్మారి యొక్క మత్తు వల్ల వాళ్ల దృష్టి నేరాల వైపు, దొంగతనం వైపు వెళు తూ వారు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. దీనిపై మండల అధికారులు స్పందించి మండల ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటనిగంజాయి లాంటి మహమ్మారి నుండి మన ఊరిని, యువత భవిష్యత్తుని కాపాడేందుకు గంజా యి వినియోగం లాంటి కార్యకలాపాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. బాధ్యత గల పౌరులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరు. అందువల్ల అశ్వాపురం మండల పోలీస్ శాఖ ప్రజలందరినీ గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించాలని కోరుతోంది. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడే సమాచారాన్ని అందించిన వారికి ₹మంచి బహుమతి ఇవ్వబడుతుంది. సమాచారం ఇచ్చే వ్యక్తి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి.ప్రజలు తమ సమాచారం ఈ ప్రత్యేక మొబైల్ నంబర్ ద్వారా అందించవచ్చు **[87126 82093 ]**మీ చిన్న సమాచారం ఒక పెద్ద మార్పును తీసుకురాగలదు. మన యువతను కలిసి అశ్వాపురం మండలాన్ని పూర్తిగా డ్రగ్స్ రహిత మండలంగా కాపాడుకుందాం మార్చుకుందాం.

**ఇట్లు**
**అశ్వాపురం పోలీస్ శాఖ**

## మానసిక కలతతో యువకుడు విషం సేవించి మృతి

**దమ్మపేట, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యానికి బానిసై మద్యం మత్తులో తెలియని విషపదార్థాన్ని మద్యంలో కలిపి సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనపై క్రైం నెంబర్ 85/2026, యూ/ఎస్ 194 బి.యన్.యస్ కింద కేసు నమోదు చేయబడింది. పోలీసుల వివరాల ప్రకారం ఈ సంఘటన 03-04-2026 రాత్రి సుమారు 11.00 గంటలకు దమ్మపేట మండలం తాటిమల్లప్పగుంపు గ్రామంలో జరిగినది కాగా, 10-04-2026 ఉదయం 08.00 గంటలకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారు వడే రాజులు, తన కుమారుడు వడే రాము గురించి ఫిర్యాదు చేశారు. మృతుడు మద్యం సేవించడానికి అలవాటు పడి, వివాహం జరగకపోవడంతో మానసికంగా కలత చెంది ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తెలియని విషపదార్థాన్ని మద్యంలో కలిపి సేవించి ఆత్మహత్యాయత్నం ప్రయత్నం చేయడంతో, కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ 09-04-2026 రాత్రి సుమారు 11.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

## మద్యం వ్యసనం కారణంగా విషం సేవించి యువకుడు మృతి

**దమ్మపేట, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలం లచ్చాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం వ్యసనం కారణంగా మానసికంగా కలత చెంది విషం సేవించి ఆత్మహత్యాయత్నం చేసి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్. 86/2026, యూ/ఎస్ 194 బి.యన్.యస్ కింద కేసు నమోదు చేయబడింది. ఈ సంఘటన 09-04-2026 మధ్యాహ్నం సుమారు 12.00 గంటలకు లచ్చాపురం గ్రామంలో జరిగింది.ఫిర్యాదుదారు గంప వరలక్ష్మి, తన సోదరుడు అల్లం సాయి ప్రసాద్ గురించి ఫిర్యాదు చేసింది. మృతుడు మద్యం సేవించడానికి అలవాటు పడి, కూలీ పనులు చేయలేకపోవడంతో జీవితంపై విసుగుతో ఉన్నట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో అతను తెలియని విషపదార్థాన్ని సేవించి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. అనంతరం కుటుంబ సభ్యులు అతన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ 10-04-2026 తెల్లవారుజామున సుమారు 01.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# భగభగలతో భానుడు.... ఎండల తాకిడి తీవ్రం

- ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- శీతల పానీయాలకు పెరిగిన డిమాండ్







**దమ్మపేట, ఏప్రిల్ 10 (ప్రజా జ్యోతి)** :వేసవి కాలం ప్రారంభమవుతుండగానే దమ్మపేట మండలంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. భానుడు భగభగలతో మండిపడుతూ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పగటి వేళల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా, రాత్రి వేళల్లో కూడా ఉక్కపోత కారణంగా ప్రజలు నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో మరింత ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ››› పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఉదయం వేళల్లో కొంత చల్లదనం ఉన్నప్పటికీ, ఉదయం 10 గంటలు దాటిన తర్వాత ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరుగుతోంది. మధ్యాహ్నం సమయాల్లో బయట తిరగడం కష్టసాధ్యంగా మారింది. ఎండ వేడి కారణంగా ప్రజలు అత్యవసర పనులు తప్ప బయటకు రావడం మానుకుంటున్నారు.

### ››› వెలవెలబోతున్న వీధులు

మధ్యాహ్నం వేళల్లో గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాధారణంగా రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాలు కూడా వెలవెలబోతున్నాయి. వేడి తీవ్రతతో వ్యాపార కార్యకలాపాలు కూడా కొంత మేర తగ్గుముఖం పట్టాయి.

### ››› చల్లని పానీయాల వైపు మొగ్గు

వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఐస్ క్రీములు, శీతల పానీయాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ఈ పానీయాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి బండ్లు, జ్యూస్ సెంటర్లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.

### ››› విద్యార్థులకు ఎండ ఇబ్బందులు

ఈ సమయంలో జరుగుతున్న పరీక్షల కారణంగా విద్యార్థులు మండుతున్న ఎండలో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో అలసట, తలనొప్పి, దాహం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.


### ››› ఆరోగ్య సమస్యల ముప్పు

వైద్యుల ప్రకారం, తీవ్ర ఎండల కారణంగా హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్, విరేచనాలు, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

**జాగ్రత్తలే రక్షణ –ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు:**

రోజుకు కనీసం 3–4 లీటర్ల నీరు తాగాలి .మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలి, గొడుగు, టోపీ లేదా గుడ్డతో తలను కప్పుకోవాలి, పలుచని లేత రంగు దుస్తులు ధరించాలి,కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవాలు తీసుకోవాలి. వీధి ఆహారం, అపరిశుభ్రమైన ఆహారం తీసుకోవద్దు. పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.వాంతులు, విరేచనాలు, అధిక జ్వరం, కళ్లు లేదా చర్మం పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించడం అత్యవసరం. ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

# పాల్వంచలో చిట్టి మాఫియా ఆగడాలు





- ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకుంటున్న నిర్వాహకులు
- పేద, మధ్యతరగతి వాళ్లే టార్గెట్
- పర్మిషన్ లేని దందా, ప్రజల్లో నెలకొన్న పరేషన్

**పాల్వంచ, ఏప్రిల్ 10, ప్రజాజ్యోతి:** రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న చిట్టి వ్యాపారాలపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పాల్వంచ మరియు పరిసర ప్రాంతాలలో చిట్టి వ్యాపారం నియంత్రణ తప్పి ఒక మాఫియా తరహాలో విస్తరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చట్టబద్ధ అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున చిట్టీలు నిర్వహించడం, సభ్యుల నుంచి లక్షల రూపాయలు సేకరించడం, అవసరమైన సమయంలో డబ్బులు ఇవ్వకపోవడం వంటి ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి.

### ››› చెల్లింపులు ఆలస్యం , చిట్టి నిర్వాహకులు పరారీ ఘటనలు

చిట్టి పేరుతో నడుస్తున్న ఈ వ్యాపారాల్లో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బాధితులు వాపోతున్నారు. చిట్టి ఎత్తిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేయడం, చెల్లింపులు ఆలస్యం చేయడం, చివరకు చిట్టి నిర్వాహకులు పరారయ్యే ఘటనలు కూడా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ››› చెల్లించడం లో ఆలస్యమైతే బెదిరింపులు, అవమానాలు, దౌర్జన్యాలు

చిట్టి డబ్బులు ఒకటి లేదా రెండు నెలలు ఆలస్యమైతే నిర్వాహకులు సభ్యుల ఇళ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది బాధితులు "డబ్బులు సమయానికి ఇవ్వకపోతే అవమానాలు, దౌర్జన్యాలు ఎదుర్కోవాల్సి వస్తోంది" అని చెబుతున్నారు. ఈ పరిస్థితులు సామాన్య ప్రజల్లో భయాందోళనలకు దారితీస్తున్నాయి.

### ››› ప్రభుత్వ ఉద్యోగులే ప్రథమం

ముఖ్యంగా ఈ చిట్టీలు నడిపించేవారిలో అధికశాతం ప్రభుత్వ ఉపాధ్యాయులు, కేటీపీఎస్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. విశ్వసనీయత పేరుతో ప్రజలను ఆకర్షించి, పెద్ద మొత్తంలో చిట్టీల్లో సభ్యులను చేర్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### ››› ఖాళీ ప్రామిసరి నోటు, చెక్కు పై సంతకం చేసి ఇవ్వాల్సిందే

ఈ తరహా చిట్టి వ్యవహారాల్లో మరింత ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. చిట్టిలో చేరేందుకు ఎలాంటి కఠిన నిబంధనలు లేకపోయినా, చిట్టి పాడిన సభ్యుడికి డబ్బులు చెల్లించే సమయంలో మాత్రం కఠిన షరతులు విధిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. సభ్యుడు ఖాళీ ప్రామిసరీ నోటుపై తేదీ వేయకుండా, ఖాళీ ప్రామిసరి నోటు పై కేవలం సంతకం చేసి ఇవ్వాల్సి వస్తోందని, దీనితో పాటు బ్యాంకు చెక్కుపై కూడా సంతకం చేసి ఖాళీ చెక్కును నిర్వాహకులకు అప్పగించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది భవిష్యత్తులో ఎలా దారి తీస్తుందోనని ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ››› రాత్రికి రాత్రే పరారీ ఘటనలు

ఇటీవల పాల్వంచ పరిసర ప్రాంతాలలో చిట్టి పేరుతో డబ్బులు సేకరించి రాత్రికి రాత్రే నిర్వాహకులు అదృశ్యమైన సంఘటనలు చోటుచేసుకున్నాయని సమాచారం. దీంతో మధ్యతరగతి, రోజువారీ కూలీలు తమ కష్టార్జిత సంపాదన కోల్పోయి రోడ్డున పడిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

### ››› అనుమతి నిల్లు, సంపాదన ఫుల్లు

చట్టపరంగా చూస్తే, చిట్టి వ్యాపారం నిర్వహించాలంటే సంబంధిత అధికారుల వద్ద నమోదు తప్పనిసరి. ప్రభుత్వ అనుమతి లేకుండా చిట్టీలు నడపడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ, స్థానికంగా అనేకమంది నిర్వాహకులు ఈ నిబంధనలను పట్టించుకోకుండా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ››› అధిక కమీషన్ వసూళ్లు

సాధరణంగా చిట్టి సభ్యులతో పాటు చిట్టి నిర్వాహకుడు కూడా సభ్యుడుగా ఉంటాడు. అయితే ప్రతి చిట్టీలో రెండవ నెల మాత్రం చిట్టి నిర్వాహకుడికి ఇవ్వాలని షరతు పెడుతున్నారని, రెండవ నెల మాత్రం చిట్టి పాట నిర్వహించకుండా మొత్తం డబ్బులు చిట్టి నిర్వాహకుడిని సభ్యులు చెల్లించాల్సి వస్తుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల చిట్టి నిర్వాహకుడికి అటు చిట్టిపై వచ్చే కమీషన్ తో పాటు పూర్తి చిట్టి డబ్బులు చిట్టి మొదలైన రెండవ నెలలోనే అందుతుంది. ఇది కేవలం చిట్టి నిర్వాహకుడికి మాత్రమే లాభదాయకమని, రూపాయి రూపాయి కూడబెట్టి కడుతున్న సభ్యులకు తీరని నష్టంగా ఉంటుందని సభ్యులు లబోదిబోమంటున్నారు.

### ››› అధికారుల పర్యవేక్షణ లేకపోవడం

ఇంత పెద్ద ఎత్తున అక్రమ చిట్టీలు నడుస్తుంటే సంబంధిత విభాగాలు ఏమి చేస్తున్నాయి?" అనే దానిపై స్పష్టత లేకపోవడం. రెవెన్యూ, పోలీస్, కోఆపరేటివ్ శాఖలు సమన్వయంతో పని చేసి ఈ అక్రమాలను అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ››› కఠిన చర్యలు తీసుకోవాలి

అదేవిధంగా, చిట్టి నిర్వాహకులపై కఠిన నిఘా పెట్టడం, అక్రమంగా నడుస్తున్న చిట్టీల జాబితా సేకరించడం, అక్రమ చిట్టి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం. బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చలో హైదరాబాద్ ను విజయవంతం చేయండి

- - సింగరేణికి రావాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే రాబట్టాలి
- - నైనీ బ్లాకును ప్రైవేట్ పరం చేయడాన్ని అడ్డుకోవాలి
- - కల్వకుంట్ల కవిత కార్మికులను మోసం చేశారు
- - సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు




**మణుగూరు, ఏప్రిల్ 10, (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభం నుండి రక్షించుకునేందుకు మరియు కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈనెల 28న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు కార్మికులకు పిలుపునిచ్చారు. కే.సి.హెచ్.పి లో శుక్రవారం పిట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై మరియు యాజమాన్య వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాన డిమాండ్లు మరియు పలు అంశాలను ఈ విధంగా వెల్లడి చేశారు.

**బకాయిల విడుదల :**
రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావాల్సిన 51 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే రాబట్టాలి.

**ప్రైవేటీకరణకు వ్యతిరేకం :**
ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు వెలికితీత పనులను ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా సింగరేణి పర్మినెంట్ కార్మికులతోనే చేయించాలి. అలాగే నైనీ బ్లాకును ప్రైవేట్ పరం చేయడాన్ని అడ్డుకోవాలి.

**రాజకీయ జోక్యం :**
సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యాన్ని తగ్గించి, సంస్థను స్వయంప్రతిపత్తితో నడవనివ్వాలి.

**కార్మిక సంక్షేమం :**
ఏడాది కాలంగా ఆగిపోయిన కారుణ్య నియామకాలను పునరుద్ధరించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలి. కోల్ ఇండియా తరహాలో కార్మికుల ఇన్కమ్ టాక్స్ భారాన్ని కంపెనీయే భరించాలి. అదేవిధంగా 'మారుపేరు' సమస్య కలిగి ఉన్న కార్మికుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**పాలకులపై విమర్శలు :**
గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కల్వకుంట్ల కవిత కార్మికులను మోసం చేశారని అన్నారు. ఇప్పుడు మరోసారి కార్మికులను వంచించేందుకు సిద్ధమవుతున్నారని ఇందుకు కార్మికులు అప్రమత్తంగా ఉండి తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు. అలాగే మణుగూరు డిప్ సైడ్ బ్లాకును సింగరేణికి దక్కకుండా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర పూరితంగా వ్యవహరించాయని, ఇది మణుగూరు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**కార్యక్రమ ప్రణాళిక :**
ఈ నెల 28న విద్యుత్ సౌధ ముట్టడి మరియు సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. యూనియన్ నాయకులు ఎన్నికల అగ్రిమెంట్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని, కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం, మాచారపు లక్ష్మణరావు, ఎండి. ముజాఫర్, నల్లెల విల్సన్ రాజు, ముత్యాల సుమన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు

## మీ కడుపు సల్లం"కుండ"



(మొదటి పేజీ తరువాయి...)
వైద్యులు సూచించ డంతో, అన్ని వర్గాల ప్రజలు కుండనీళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో మార్కెట్లో మట్టి కుండలు, కూజలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

### »» వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక కుండలు

రాజస్థాన్, నాగపూర్, పోలవరం జిల్లాలోని చింతూరు ప్రాంతాల నుంచి వ్యాపారులు వివిధ ఆకృతుల్లో కుండలు, కూజలను తెచ్చి విక్రయిస్తున్నారు. చిన్న, పెద్ద సైజుల్లో లభిస్తున్న ఈ కుండల ధరలు రూ.150,200, 250 నుంచి రూ.500 వరకు ఉన్నాయి. రాజస్థాన్ నుంచి తెచ్చిన మట్టి వాటర్ బాటిల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా రూ.110కి విక్రయిస్తున్నారు.

### »» అమ్మకాలు బాగున్నాయి:నవీన్ ,వ్యాపారి



గతంలో కన్నా నేటి మార్కెట్లో వివిధ రకాల ఆకృతుల్లో తయా రైన కుండలు, కుజల కొనుగోళ్లు జరుగుతున్నాయి. కొత్త కుండలకు మంచి గిరాకీ కనిపిస్తోంది. ప్రజల నుంచి స్పందన ఉం ది. అమ్మకాలు బాగున్నాయి.

### »» కుండలో నీరు తాగుతా:మంగీలాల్ ,భద్రాచలం



కుండలో నీరు ఆరోగ్యా నికి మంచిది. ఎండకాలం లో కుండలోని నీరు తాగడం ద్వారా దాహం తీరుతుంది. చిన్నప్పటి నుంచి కుండ నీటినే తాగుతున్నా. ఏ విధ మైన ఆరోగ్య సమస్యలు రావు. ఫ్రిజ్ నీరు కన్నా కుండ నీరే మంచిది.

## క్యాంటీన్‌లో మిల్లెట్స్ వంటకాలు అందుబాటులోకి తేవాలి



(మొదటి పేజీ తరువాయి...)
అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించారు. క్యాంటీన్ ద్వారా తయారవుతున్న ఆహార పదార్థాల వివరాలను నిర్వహణ సిబ్బందిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, కార్యాలయాలకు విచ్చేసే ఉద్యోగులు, ప్రజలకు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా సిరిధాన్యాలు (మిల్లెట్స్) తో తయారుచేసిన ఇడ్లీ, దోశ వంటి ఆరోగ్యకరమైన వంటకాలను క్యాంటీన్‌లో అందుబాటులోకి తేవాలని సూచించారు. క్యాంటీన్ నిర్వహణ విధానంపై వివరాలు సేకరించి, ఎన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో నాణ్యమైన, తాజా ఆహార పదార్థాలనే విక్రయించాలని, శుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ పర్యటన సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. మహిళా సంఘాల ద్వారా తయారుచేసిన వివిధ ఆహార పదార్థాలను రుచి చూసి, మహిళల స్వయం ఉపాధి అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెవి పూర్తిగా వేరైన రోగికి విజయవంతమైన శస్త్రచికిత్స

- కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నైపుణ్యం





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 10,(ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్ టి విభాగం వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుతూ ఒక క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. చుంచుపల్లి మండలం రామవరం గ్రామానికి చెందిన నిర్మల (40), భర్త రాయమల్లు, ఈనెల 9-న తీవ్రమైన గాయంతో ఆసుపత్రిలో చేరారు. ఆమెకు (చెవి భాగం పూర్తిగా వేరైపోవడం) అనే అరుదైన, ప్రమాదకర పరిస్థితి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ పరిస్థితిని సవాల్ గా తీసుకున్న ఈఎన్ టి విభాగం వైద్య బృందం అత్యంత జాగ్రత్తగా, నైపుణ్యంతో శస్త్రచికిత్స నిర్వహించి చెవి భాగాన్ని పునఃస్థాపన చేయడంలో విజయాన్ని సాధించారు, శస్త్రచికిత్సకు ముందు , అనంతరం పరిస్థితులు కేసు తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా వైద్యుల పర్యవేక్షణలో మెరుగుదల దిశగా ఉంది, ఈ శస్త్రచికిత్సను డాక్టర్ శాంసన్ ఆధ్వర్యంలో ఈఎన్ టి వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేశారు, ఈ సందర్భంగా ఈఎన్ టి ఫ్యాకల్టీ, అనస్థీషియా విభాగం వైద్యులు, ఆపరేషన్ థియేటర్ నర్సింగ్ సిబ్బంది , టెక్నీషియన్ లు సమిష్టిగా చేసిన కృషి ప్రశంసనీయం. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఈ విజయవంతమైన శస్త్రచికిత్స భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరోసారి రుజువు చేసింది.

## మనస్థాపంతో ఎలుకల మందు తాగి మహిళా మృతి



**టేకుల పల్లి, ఏ ప్రిల్10 , ప్రజా జ్యోతి:** టేకులపల్లి మండల పరిధిలోని దాసుతండ గ్రామానికి చెందిన బానోత్ జ్యోతి (45) మనస్థాపంతో ఎలకల మందు తాగి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం దాస్ తండా చెందిన బానోత్ పుల్ సింగ్ తో 5రోజు క్రితం చేతి కర్ర విషయంలో అదే తండకు చెందిన బానోత్ దేవిజ్యా, బానోత్ చిలికి, కూతురు కొర్రా సునీత లు గొడవపడి అతన్ని కొడుతుం టే ఆపడానికి మధ్యలో వెళ్లినా భార్య బానోత్ జ్యోతిని (45) కూడా వారు కర్రలతో దాడి చేస్తూ, అసభ్య పదజాలంతో దూషించారు అని ఆమె మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న ఎలుకల మందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మందు తాగిన విషయాన్ని జ్యోతి తమ్ముడు చెప్పడంతో హుటాహుటిన వైద్య నిమిత్తం ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా లేకపోవడంతో అత్యంత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తూ మరలా తిరిగి ఖమ్మం కిమ్స్ హాస్పిటల్ కి తీసుకొచ్చి వైద్యం అందిస్తుండగా జ్యోతి శుక్రవారం మధ్యాహ్నం మరణించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపారు.జ్యోతి తల్లి గంగవత్ హంస్లీ టేకులపల్లి పోలీసు స్టేషన్ లో బానోత్ దేవిజ్యా, బానోత్ చిలికి, కూతురు కొర్రా సునీతలపై పిర్యాదు చేయగా టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.